క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీని గెలిపిద్దాం



ప్రచారం చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

అమడగూరు: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపిద్దామని వడ్డెర సంఘం నాయకులు ప్రజలను కోరారు. చినగానిపల్లి, ఒంటిచింతమాను, సాదిలివాండ్లపల్లి, ఆకులవారిపల్లి, బావాచిగానికొత్తపల్లిలో శనివారం ప్రచారం చేపట్టారు. జగన్ సర్కారు వడ్డెర్లకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి పుట్టపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం తరఫున మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పల్లె రఘునాథరెడ్డి వడ్డెర్లకు, నియోజకవర్గానికి చేసిన మేలు ఏం లేదని వివరించారు. సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఉత్తప్ప, ఆదినారాయణ, శంకర, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ కార్యకలాపాలు విస్తృతం చేయాలి

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ రంగ సంస్థలు, కంపెనీలు ఇచ్చే సీఎస్ఆర్ విరాళాల్లో కొంత మొత్తాన్ని ఆయా కంపెనీలు ఉన్న చోట ఖర్చు చేసి ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. శనివారం కియా అనుబంధ సంస్థ హుందాయ్ మోబిస్ కంపెనీ ప్రతినిధులు శనివారం కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. జిల్లాలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో పరికరాల సరఫరా కోసం రూ.44,13,436 చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ప్లాంట్ మేనేజర్ హుమిన్‌హో, ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీనివాస్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనులపై చర్యలు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) ఉల్లంఘనలపై ఫిర్యాదు అందిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. కోడ్ ఉల్లంఘించిన 27 మంది వలంటీర్లు, ముగ్గురు కాంట్రాక్ట్ సిబ్బంది, ఇద్దరు రెగ్యులర్ సిబ్బంది, ఒక రేషన్ డీలర్‌ను తొలగించినట్లు చెప్పారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: యర్రవంకపల్లి మాజీ సర్పంచ్ వై.శాంతకుమార్‌రెడ్డి(70) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం ఉదయం గ్రామానికి వెళ్లి శాంతకుమార్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుని భార్య జయమ్మ, కుమారులు మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ రజనీకాంత్‌రెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

మారని 'పల్లె' తీరు

కొత్తచెరువు: గిమ్మిక్కు రాజకీయాలకు పేరొందిన మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి తీరును ప్రజలు చీదరించుకుంటున్నా ఆయన తీరు మారడం లేదు. ప్రధానంగా టీడీపీ వారికే కండువాలు వేసి తమ పార్టీలోకి ప్రత్యర్థి పార్టీ వారు చేరినట్లు ప్రచారం సాగిస్తున్నారు. శనివారం స్థానిక పెద్ద మసీదు కాలనీకి చెందిన నరసింహమూర్తి, మస్తాన్, నారాయణస్వామి, పెద్దన్న,అమర, రాము అనే ఆరుగురు టీడీపీ కార్యకర్తలకు కండువావేసి పార్టీలోకి 20 కుటుంబాలు చేరాయని ప్రకటించారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ట

పుట్టపర్తి అర్బన్: బత్తలపల్లిలో సీతారాముల విగ్రహప్రతిష్టాపన వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో పూజలు చేపట్టారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి స్వాములను దర్శించుకుని పూజలు చేయించారు. ఆయన్ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



గర్భిణులతో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా అధికారులు

ధర్మవరం రూరల్: పోతుకుంటలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని శనివారం హెచ్ఎంఐఎస్ వాలిడేషన్‌లో భాగంగా డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ, డీపీఓ నాగరాజు, డేటా మేనేజర్ సుబ్బారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అలాగే కొద్ది మందికి రక్త పరీక్షలు నిర్వహించి వారిలో హిమోగ్లోబిన్ శాతాన్ని క్రాస్ చేశారు. దర్శనమల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దిలీప్‌కుమార్, సూపర్‌వైజర్ జైతూన్‌బీ, ఏఎన్ఎం శ్యామల, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి ఉన్నారు.

నృసింహుడి వైభవం..భక్తజన పరవశం



కనరో భాగ్యము: రథంపై ఊరేగుతున్న లక్ష్మీనృసింహుడు



నమో నారసింహా: రథానికి ప్రణామాలు సమర్పిస్తున్న భక్తులు



స్వామి ఆశీర్వాదం: స్వామి హారతి చూపుతున్న అర్చకుడు

కదిరి: శ్రీదేవి, భూదేవిల సమేత లక్ష్మీ నారసింహుడు శనివారం బ్రహ్మరథంపై తిరువీధుల్లో తన భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు తిరు వీధులన్నీ భక్తులతో పోటెత్తాయి. ఏ మిద్దెపై చూసినా భక్తులే కన్పించారు. భక్తులు దవణం, మిరియాలు, అరటి పండ్లు రథంపైకి విసిరి స్వామి వారిని స్మరించుకున్నారు. అడుగడుగునా అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేశారు. రథోత్సవంలో 3 లక్షల మందికి పైగా భక్తులు పాల్గొన్నట్లు అంచనా. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మధ్యాహ్నం 1 గంట లోపే తేరు యథాస్థానం చేరుకుంది.



పుణ్యకార్యం: భక్తులకు అన్నదానం



అదిగో ఖాద్రీశుడు: నృసింహుడి రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం



జై కంబాలరాయుడా: స్వామి వారికి నమస్కరిస్తున్న యువకుడు



మీ ఆశీస్సులే కావాలి: రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్.మక్బూల్



ప్రసాదం: తినుబండారాలు కొనుగోలు చేస్తున్న జనం



అంతా మంచే జరగాలి: రథం కదిలేముందు ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు



ప్రత్యేకం: కదిరి కుంకుమ కొనుగోలు చేస్తున్న మహిళలు



స్వామి వారి ప్రీత్యర్థం: దవణం కొనుగోలు చేస్తున్న భక్తులు

ధర్మవరాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న కేతిరెడ్డి సుప్రియ

ధర్మవరం అర్బన్: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని మరోసారి గెలిపించుకుని ధర్మవరం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే కేతిరెడ్డి సతీమణి సుప్రియ ప్రజలను కోరారు. పట్టణంలోని 39వవార్డు రాంనగర్ రామాలయం నుంచి శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ధర్మవరంలో కేతిరెడ్డి ఎమ్మెల్యే కావాలన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ, కౌన్సిలర్లు కడప రంగస్వామి, యర్రగుంట్ల భాగ్యలక్ష్మి, కత్తె ఆదిలక్ష్మి, బాలం ఓబులమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



చెన్నేకొత్తపల్లిలో టీడీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న తోపుదుర్తి రాజశేఖరరెడ్డి

చెన్నేకొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వెంకటంపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం చెన్నేకొత్తపల్లిలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి టీడీపీ నాయకులకు కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ముష్టికోవెల చిన్నసుబ్బరాయుడు, బోయ చింతకాయల క్రిష్టప్ప, సోదనపల్లి సుబ్బరాయుడు (పూజారి), సోదనపల్లి సుబ్రహ్మణ్యం, ఆర్వేటి ఓబుళేసు, యర్రపోతప్ప గారి నరసింహులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్యతరగతి ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ నర్సిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.గోవిందరెడ్డి, వెంకటంపల్లి సర్పంచ్ జయరామిరెడ్డి, నాయకులు చంద్రశేఖరరెడ్డి, హనుమంతరెడ్డి, లింగమయ్య, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తచెరువులో 'దుద్దుకుంట' ప్రచారం

కొత్తచెరువు: మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. కొత్తచెరువు నాగుల కనుమ నుంచి ఎస్ఎల్‌వీ ఫంక్షన్‌హాల్ వరకు భారీ బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

అమడగూరు, నల్లమాడలో టీడీపీకి ఎదురుదెబ్బ



మహమ్మదాబాద్‌కు చెందిన మైనార్టీలు, బీసీలతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



కొండకింద తండావాసులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లింలు, బీసీలు, గిరిజనులు

పుట్టపర్తి: అమడగూరు, నల్లమాడ మండలాల్లో టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అమడగూరు మండలం మమ్మదాబాద్, నల్లమాడ మండలం కొండకింద తండాలకు చెందిన పలువురు ముస్లింలు, బీసీలు, గిరిజన నాయకులు శనివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పుట్టపర్తిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహ్మదాబాద్‌కు చెందిన ముస్లిం నేతలు మాట్లాడుతూ సీఎం జగన్, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆకర్షించడంతో పాటు బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకోవడంతో టీడీపీని వీడామన్నారు. ఎన్నికల్లో టీడీపీ కూటమికి గట్టిగా బుద్ధి చెబుతామన్నారు. గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు చాంద్‌బాషా, ముస్తాక్, ఫయాజ్, రిజ్వాన్, బాబా, షబ్బీర్‌లతో పాటు బీసీ నేతలు సురేష్, నరసింహులు, శంకర్ తదితరులు పార్టీలో చేరారు. అలాగే కొండకిందతండాకు చెందిన నాగరాజునాయక్, వాఘేనాయక్, రామస్వామినాయక్, శంకర్‌నాయక్, రవినాయక్, లక్ష్మనాయక్, సేవేనాయక్, పరుశురాంనాయక్, రాజశేఖర్ నాయక్ తదితరులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు.

యువకుడు ఆత్మహత్య

బత్తలపల్లి: గరిశలపల్లికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. గ్రామానికి చెందిన అంకప్ప, బొజ్జమ్మ చిన్న కుమారుడు అనిల్‌కుమార్(25) కియాలో ఉద్యోగం చేసేవాడు. ధర్మవరంలో స్నేహితులతో కలిసి అద్దె రూంలో ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి రూంలో క్రిమిసంహారక మందు సేవించాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని స్నేహితులు వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో శనివారం ఉదయం మృతి చెందాడు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్ఎస్ఐ మల్లిక బాధ్యతల స్వీకరణ



పుట్టపర్తి టౌన్: నూతన ఆర్ఎస్ఐగా మల్లికా శనివారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లాలో ఆర్ఎస్ఐగా పనిచేస్తున్న మల్లిక శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె ఎస్పీ మాధవరెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. సమర్థవంతంగా పని చేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఎస్పీ ఆమెకు సూచించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పుట్టపర్తి రూరల్: పట్టణంలోని కోట వీధికి చెందిన బెస్త చంద్రశేఖర్ (30) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తనయుడు దుద్దుకుంట కిషన్‌రెడ్డి మృతుని నివాసం వద్దకు వెళ్లి చంద్రశేఖర్ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆలోచించి అభివృద్ధి వైపు నిలవండి



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలోకి చేరిన 5వవార్డు టీడీపీ సానుభూతిపరులు, కార్యకర్తలు



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలోకి చేరిన 25వవార్డు టీడీపీ సానుభూతిపరులు, ఇతర పార్టీల కార్యకర్తలు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- 170 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

ధర్మవరం అర్బన్: ప్రజలు ఆలోచించి అభివృద్ధి, సంక్షేమం వైపు నిలవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో శనివారం 05, 25 వార్డుల నుంచి 170 కుటుంబాలు టీడీపీ సానుభూతిపరులు, ఇతరపార్టీల వారు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారందరికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో 1.04 లక్షల ఇళ్లుంటే 97 వేల ఇళ్లకు(93శాతం) పథకాలు అందించామన్నారు. ధర్మవరం ఎమ్మెల్యేగా ఉంటూ తాగునీరు, ఆస్పత్రులు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలు, రహదారులు, రిజర్వాయర్లు, పాఠశాలలు ఇలా అనేక అభివృద్ధి పనులు చేసి చూపించామన్నారు. టీడీపీ హయాంలో ఒక్కటైనా అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. భవిష్యత్తులో కేతిరెడ్డి అంటేనే అభివృద్ధి అని ప్రతి ఒక్కరూ చెప్పుకునేలా పనిచేశానన్నారు. ధర్మవరంలో అన్ని కాలనీలు తానే ఏర్పాటు చేసినవేనన్నారు. 25వేల ఇళ్ల పట్టాలు అందించి పేదల సొంతింటి కలను నెరవేర్చానని తెలిపారు. 5వ వార్డు కౌన్సిలర్ దాసునాయక్, 25వవార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కోటిరెడ్డి బాలిరెడ్డి, ప్రకాష్, కౌన్సిలర్లు గోరకాటి పురుషోత్తంరెడ్డి, నాయకులు మేడాపురం సూరి, రేగాటిపల్లి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేస్తేనే గెలుస్తారు...

ధర్మవరంలో కేతిరెడ్డిని తిడితే కాదని, ప్రజల కోసం పనిచేస్తే గెలుస్తారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పేర్కొన్నారు. గత ఎన్నికల ముందు పెద్ద పెద్ద డైలాగ్‌లు కొట్టారని, ఒకరేమో ఓడిపోయిన 15 రోజులకే పార్టీ మారితే... ఇంకొకరు వాళ్ల నాన్న, అమ్మలు మంత్రులుగా పని చేసినా కూడా వాళ్ల నియోజకవర్గంలోని గ్రామాలకు ఇప్పటికి రోడ్లు వేయించిన దాఖలాలులేవన్నారు. ఇప్పుడు కనీసం టికెట్టు కూడా తెచ్చుకోలేకపోయారన్నారు. ఇంకొకరు సేవ్ ధర్మవరం అంటూ తనకు టికెట్టు ఇవ్వాలని పెద్ద పెద్ద డైలాగ్‌లు కొట్టాడని, ఇప్పుడు షేమ్ షేమ్ అయ్యాడని ఎద్దేవా చేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్

ఎన్పీ కుంట: మండెంవారిపల్లికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు శనివారం సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి చొరవతో వైఎస్సార్‌సీపీలో చేరారు. కదిరిలోని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ తన కార్యాలయంలో వారికి కండువాలను వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధికార్యక్రమాలు నచ్చి పార్టీలోకి చేరినట్లు వారు తెలిపారు. మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి, సీనియర్ నాయకుడు షామీర్‌బాషా, వాటర్ షెడ్ చైర్మన్ కృష్ణారెడ్డి, గ్రామ కన్వీనర్ అస్లం, మాజీ మండల కన్వీనర్ బాబా ఫక్రుద్దీన్ , శ్రీరాములు, రఘు పాల్గొన్నారు.

పార్టీ విజయం కోసం సమన్వయంతో పనిచేయాలి

తనకల్లు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం కోసం సమన్వయంతో పనిచేయాలని కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, వైఎస్సార్ సీపీ నేత ఎంజీ రెడ్డితో పాటు పలువురు నాయకులు శనివారం బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంజీ రెడ్డి ఆధ్వర్యంలో బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సమరసింహారెడ్డి, వినోద్‌కుమార్, ముబారక్, హరి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

కొత్తచెరువు: జగన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సమన్వయంతో పని చేద్దామని వైఎస్సార్‌సీపీ మండల ఎన్నికల పరిశీలకుడు అవుటాల రమణారెడ్డి పేర్కొన్నారు. బైరాపురం, సాయినగర్, ఓబుళదేవరచెరువు గ్రామాల్లో నాయకులతో సమావేశమయ్యారు. సీఎం జగన్ రెండవ సారి ముఖ్యమంత్రి కావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి శాంతమ్మను గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శివారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామచంద్ర, చెన్నకేశవులు, నారప్ప, వీరప్ప, పోతన్న, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పల్లె నిద్ర

కనగానపల్లి: తగరకుంట గ్రామంలో శనివారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర చేశారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో స్థానిక గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు.